సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 2 । ఆగస్టు । 2023



మిడ్‌మానేరుకు ఇన్‌ఫ్లో

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులోకి వరద ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు నీటి మట్టం సోమవారం 20.40 టీఎంసీలకు చేరింది.



సమస్యలు పరిష్కరించండి

సిరిసిల్లటౌన్‌: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని అంగన్‌వాడీలు మంగళవారం సిరిసిల్లలోని ఎమ్మెల్యే కేటీఆర్‌ క్యాంప్‌ ఆఫీస్‌ ఎదుట ధర్నా చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

కలెక్టరేట్‌ ఏవోగా విజయ్‌కుమార్‌



విజయ్‌కుమార్‌

సిరిసిల్ల: కలెక్టరేట్‌ అడ్మినిస్ట్రేషన్‌ అధికారి(ఏవో)గా కలికోట విజయ్‌కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కలెక్టరేట్‌లో ఏవోగా పనిచేసిన బొద్దుల గంగయ్య ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆయన స్థానంలో సిరిసిల్ల తహసీల్దార్‌గా ఉన్న విజయ్‌కుమార్‌ను నియమించారు.

నేడు కేడీసీసీ బ్యాంక్‌ ప్రారంభం



వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లిలో ఏర్పాటు చేసిన కేడీసీసీ బ్యాంక్‌ను బుధవారం ప్రారంభించనున్నట్లు టెస్కాబ్‌ చైర్మన్‌ కొండూరి రవీందర్‌రావు తెలిపారు. రవీందర్‌రావు మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్‌ అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రైతులకు ఇబ్బంది కలగకూడదనే మండల కేంద్రంలో కేడీసీసీబీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

వేములవాడ ఆర్డీవోగా మధుసూదన్‌

వేములవాడ: వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్‌ భద్రాచలం గిరిజన సంక్షేమ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పి.మధుసూదన్‌ను నియమించారు. రెండు రోజుల క్రితం గంగయ్యను రాజన్న ఆలయ ఈవోగా నియమించగా.. ఆయన విధుల్లో చేరకముందే ఉత్తర్వుల్లో మార్పు చేశారు. గంగయ్యను జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిగా నియమించారు.

జిల్లాలో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. వీర్నపల్లిలో అత్యధికంగా 6.4 మిల్లీమీటర్ల వర్షం పడగా.. రుద్రంగిలో 2.9, చందుర్తిలో 1.6, వేములవాడ రూరల్‌లో 2.0, బోయినపల్లిలో 1.8, సిరిసిల్లలో 4.6, కోనరావుపేటలో 2.5, ఎల్లారెడ్డిపేటలో 2.3, గంభీరావుపేటలో 3.3, ముస్తాబాద్‌లో 4.1, తంగళ్లపల్లిలో 6.2, ఇల్లంతకుంటలో 4.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వేములవాడ పట్టణంలో పెద్దగా వర్షం పడలేదు.

సమస్యలు పరిష్కరించండి




బోయినపల్లి(చొప్పదండి): ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించేలా సిఫారసు చేయాలని మండలంలోని గ్రామపంచాతీ కార్మికులు మంగళవారం జెడ్పీ సీఈవో గౌతంరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన జెడ్పీ సీఈఓను సీఐటీయూ మండల కన్వీనర్‌ గురజాల శ్రీధర్‌తో కలిసి విన్నవించారు. జీపీ కార్మికులు అక్కెనపెల్లి లక్ష్మణ్‌, చెలిమల్ల బాబు ఉన్నారు.

ట్రేడ్‌ లైసెన్స్‌ కావాలా?!

సిరిసిల్లటౌన్‌: సిరిసిల్లలో పలువురికి మున్సిపల్‌ సిబ్బంది పేరుతో సైబర్‌ నేరస్తులు ఫోన్‌కాల్స్‌ చేయడం కలకలం సృష్టించింది. ఈమేరకు మంగళవారం మున్సిపల్‌ కమిషనర్‌ వెల్దండి సమ్మయ్య ప్రకటన జారీ చేశారు. కొందరు సైబర్‌ నేరగాళ్లు 90008 15406, 90141 96471 నంబర్లతో కాల్‌చేసి ట్రేడ్‌ లైసెన్సులపై ఫోన్‌చేస్తూ డబ్బులు అడుగుతున్నారన్నారు. మున్సిపల్‌ సిబ్బంది పేరుతో ఎలాంటి మెస్సేజ్‌లు, కాల్స్‌ వస్తే స్పందించొద్దని, డబ్బులు ఇవ్వవద్దని కోరారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి



ముస్తాబాద్‌(సిరిసిల్ల): పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లగిశెట్టి శ్రీనివాస్‌ కోరారు. ముస్తాబాద్‌లోని పద్మశాలీ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 13న కోరుట్లలో నిర్వహించే పద్మశాలీ రాజకీయ యుద్ధభేరికి పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. మండలాధ్యక్షుడు భరత్‌, పట్టణాధ్యక్షుడు తడుక బాలకిషన్‌, గూడూరి రాజమల్లయ్య, లక్ష్మీనారాయణ, నందు, దేవానందం, కృష్ణహరి, సత్యనారాయణ, పలి విఠల్‌, వాసుదేవ్‌ తదితరులు పాల్గొన్నారు.

వాగు దాటని పల్లెలు

- తెగిన రహదారులు.. నిలిచిన రాకపోకలు
- జిల్లాలో పల్లెవాసులకు పుట్టెడు కష్టాలు
- చిన్నపాటి వరదలకే కొట్టుకుపోతున్న రోడ్లు
- ఇబ్బందుల్లో గ్రామీణులు
- శాశ్వత పనులు చేపట్టాలని డిమాండ్‌



ఇది బోయినపల్లి నుంచి విలాసాగర్‌ మీదుగా మల్లాపేట నుంచి కరీంనగర్‌ వెళ్లే రహదారిపై కొట్టుకుపోయిన కల్వర్టు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు ఎక్కువగా రావడంతో రోడ్డు కోతకు గురైంది. కల్వర్టు ధ్వంసమైంది. గతేడాది కూడా ఇక్కడే కోతకు గురికాగా రూ.5లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఈసారి మళ్లీ కొట్టుకుపోయింది.



ఇది ఇల్లంతకుంట మండలం జవారిపేట–నర్సక్కపేట మధ్య బిక్కవాగుపై నిర్మించిన లోలెవల్‌ వంతెన ఇటీవలి వర్షాలకు కొట్టుకుపోయింది. ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఎవరైనా గన్నేరువరం, కరీంనగర్‌ వెళ్లాలంటే ఈ రోడ్డే దిక్కు. రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి.



ఇది కోనరావుపేట మండలం బావుసాయిపేట–వెంకట్రావుపేట మధ్య మూలవాగుపై కొట్టుకుపోయిన లోలెవల్‌ కాజ్‌వే. బావుసాయిపేట నుంచి కోనరావుపేటకు వెళ్లాలంటే ఈ వాగు దాటాల్సిందే. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మూలవాగు పొంగడంతో కాజ్‌వే ముక్కలైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. గత పదేళ్లలో ఈ కాజ్‌వే నాలుగుసార్లు తెగిపోయింది. ఇక్కడ హైలెవల్‌ వంతెన నిర్మించాలనే ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు.

జిల్లాలో రోడ్ల స్వరూపం

ఆర్‌అండ్‌బీ రోడ్లు	: 595.869 కిలోమీటర్లు
బీటీ రోడ్లు	: 570.061 కిలోమీటర్లు
సిమెంట్‌ రోడ్లు	: 20.308 కిలోమీటర్లు
మట్టిరోడ్లు	: 5.50 కిలోమీటర్లు
పీఆర్‌ పరిధి రోడ్లు	: 2,986.458 కిలోమీటర్లు
సిమెంట్‌రోడ్లు	: 2193 కిలోమీటర్లు
మట్టిరోడ్లు	: 155.435 కిలోమీటర్లు

సిరిసిల్ల: జిల్లాలోని రోడ్లు ఇటీవల కురిసిన వర్షాల ధాటికి ధ్వంసమయ్యాయి. పంచాయతీరాజ్‌, రోడ్లు, భవనాలశాఖ ఆధీనంలోని రహదారులు తెగిపోగా.. లోలెవల్‌ వంతెనలు కొట్టుకుపోయాయి. ఫలితంగా పల్లెలకు ఏటా వర్షాకాలంలో వరదకష్టాలు తప్పడం లేదు. వాగులు పొంగి వంతెనలు తెగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏటా వరదలు వచ్చి రోడ్లు కొట్టుకుపోతున్నా శాశ్వత పనులు చేపట్టడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఏటా మరమ్మతులు

జిల్లాలోని గ్రామీణ రోడ్లను గతేడాది రూ.2.50 కోట్లతో మరమ్మతు చేశారు. కానీ మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి నెలకొంది. ఒక్క పంచాయతీరాజ్‌ శాఖ పరిధిలోనే ప్రస్తుతం రూ.1.23 కోట్ల ప్రతిపాదనలు చేశారు. ఇలా తాత్కాలిక పనులకే ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు. గతేడాది ఆయా ప్రాంతాల్లో హైలెవల్‌ వంతెనల నిర్మాణాలకు రూ.10.50కోట్లతో చేసిన ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చలేదు. దీంతో తాత్కాలిక పనులు వరదపాలవుతున్నాయి. పంచాయతీరాజ్‌ పరిధిలోని రోడ్ల శాశ్వత మరమ్మత్తులకు రూ.30.50 కోట్లతో ప్రతిపాదించారు. అయితే ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి. పల్లెవాసులకు పక్కా రోడ్లు దరిచేరడం లేదు. ఫలితంగా ఏటా వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోయి రోజుల తరబడి ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

హైలెవల్‌ వంతెన నిర్మించాలి



ఏటా వర్షాకాలంలో ఇలాగే వాగులో తెగిపోతుంది. బావుసాయిపేట–వెంకట్రావుపేట మధ్య హైలెవల్‌ వంతెన నిర్మిస్తేనే సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది. స్కూల్‌ పిల్లలు మోడల్‌స్కూల్‌కు వెళ్లేందుకు, మండల కేంద్రానికి ప్రజలు పోవడానికి ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలి.
– భైరగోని నందుగౌడ్‌, బావుసాయిపేట

ఏటా ఇదే సమస్య



జవారిపేట–నర్సక్కపేట మధ్య బిక్కవాగులో ఏటా రోడ్డు కొట్టుకుపోతుంది. భారీ వర్షాలు పడితే లోలెవల్‌ వంతెన వరదపాలవుతుంది. రెండు ఊర్ల మధ్య రాకపోకలు ఆగిపోతున్నాయి. శాశ్వత ప్రతిపాదికన హైలెవల్‌ వంతెన నిర్మించాలి. తాత్కాలికంగా మరమ్మతులు చేసి రాకపోకలు సాగేలా చూడాలి.
– బొల్ల సత్తిరెడ్డి, నర్సక్కపేట



ఇది గంభీరావుపేట మండలం మల్లుపల్లి–నాగంపేట మధ్య మూలవాగుపై కొట్టుకుపోయిన రోడ్డు. వరద ఎక్కువ రావడంతో రోడ్డు కోతకు గురైంది. పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ప్రస్తుతం ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. సిరిసిల్లకు రావాలంటే మరో మార్గంలో ప్రయాణించడం దూరభారమవుతుంది. గత పదేళ్లలో ఇక్కడే మూడుసార్లు రోడ్డు కోతకు గురైంది. ప్రతి సారి తాత్కాలిక మరమ్మతులు చేయడంతోనే అధికారులు సరిపెడుతున్నారు.



ఇది కోనరావుపేట మండలం మామిడిపల్లి–నిజామాబాద్‌ మధ్య మూలవాగుపై కొట్టుకుపోయిన లోలెవల్‌ వంతెన. ఏటా భారీ వర్షాలతో ఇక్కడ వంతెన కొట్టుకుపోవడం, మట్టి పోసి తాత్కాలికంగా రిపేర్లు చేయడం పరిపాటిగా మారింది. ఇక్కడ హైలెవల్‌ వంతెన నిర్మించాలనే ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. ఫలితంగా ఏటా ఇలా వంతెన తెగిపోవడం రాకపోకలు నిలిచిపోవడం జరుగుతుంది.

ప్రజలకు చేరువలో పోలీస్‌ సేవలు

- ఎస్పీ అఖిల్‌ మహాజన్‌
- బోయినపల్లి ఠాణాదివస్‌లో 109 ఫిర్యాదులు

బోయినపల్లి(చొప్పదండి): ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకే ఠాణాదివస్‌ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్‌ పేర్కొన్నారు. బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన ఠాణాదివస్‌లో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ గతంలో వేములవాడరూరల్‌, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంటల్లో నిర్వహించిన ఠాణాదివస్‌లలో వచ్చిన 43 ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సివిల్‌ సమస్యలపై లీగల్‌సెల్‌ను సంప్రదించాలని, క్రిమినల్‌ అంశాలపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పంచాయితీల పేరున ఇరువర్గాల నుంచి డబ్బులు వసూలు చేసే దళారీలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై షీటీం, సఖీ సెంటర్‌కు సూచించారు. భూసమస్యలు, అప్పులు చెల్లించడం లేదని, రోడ్డు ప్రమాదాల కేసుల్లో న్యాయం కోసం, పిల్లలు పట్టించుకోవడం లేదని బాధితులు ఠాణాదివస్‌లో ఫిర్యాదు చేశారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్‌ సీఐ కృష్ణకుమార్‌, ఎస్సై మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ మొక్కలు నాటారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్‌



ఫిర్యాదులు నమోదు చేస్తున్న పోలీసులు

నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- టీపీటీడీసీ చైర్మన్‌ గూడూరి ప్రవీణ్‌

సిరిసిల్ల: నేతన్నల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని టీపీటీడీసీ చైర్మన్‌ గూడూరి ప్రవీణ్‌ పేర్కొన్నారు. సిరిసిల్లలో మంగళవారం నేతన్నల అవగాహన సదస్సులో మాట్లాడారు. రైతుల తరహాలో నేతన్నలకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తుందన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ చొరవతో సిరిసిల్లకు బతుకమ్మ చీరల ఆర్డర్లు, ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు వస్తున్నాయన్నారు. నేతకార్మికులకు 10 శాతం యారన్‌ సబ్సిడీని అందిస్తూ.. కార్మికుల మెరుగైన కూలి లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. అదనపు కలెక్టర్‌ ఎన్‌.ఖీమ్యానాయక్‌ మాట్లాడుతూ నేతన్నల కోసం రాష్ట్ర ప్రభుత్వం త్రిఫ్ట్‌ వంటి పొదుపు పథకాలను అమలు చేస్తుందని వివరించారు. సిరిసిల్ల మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జిందం కళాచక్రపాణి మాట్లాడుతూ సిరిసిల్ల నేతన్నలకు బతుకమ్మ చీరల ఆర్డర్లు రావడంతో వస్త్రపరిశ్రమ మెరుగుపడిందన్నారు. ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవానికి హాజరుకావాలని కోరారు. జౌళిశాఖ ఆర్‌డీడీ వి.అశోక్‌రావు, ఏడీ సాగర్‌, మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ మంచె శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్‌

ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన

సిరిసిల్ల: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాలు(ఈవీఎం), వీవీప్యాట్‌లపై అవగాహన ప్రదర్శన కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో జూలై 20 నుంచి ప్రదర్శన కేంద్రం కొనసాగుతోంది. ఆర్డీవో ఆఫీస్‌ వివిధ పనుల కోసం వచ్చే వారికి ఓటింగ్‌యంత్రాల పనితీరుపై అవగాహన కల్పిస్తున్నారు. ఓటింగ్‌యంత్రంపై ఏ గుర్తుకు ఓటు వేస్తే.. అదే గుర్తుకు ఓటు పడుతుంది, మరో గుర్తుకు పడుతుందనే అపోహను తొలగించేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పది రోజుల్లో సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో 359 మంది ఈవీఎంల పనితీరును పరిశీలించారని కేంద్రం ఇన్‌చార్జి దూలం శ్రీనివాస్‌గౌడ్‌, ఎస్‌.ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఈవీఎం అవగాహన కేంద్రానికి వచ్చిన వారి పేర్లు, ఫోన్‌ నంబర్లు, సంతకాలను సేకరిస్తున్నారు. జిల్లాలో మొబైల్‌ ఈవీఎం అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నాటికి అందరికీ ఈవీఎంలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని శ్రీనివాస్‌గౌడ్‌ వివరించారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు



అవ్వా.. ఇక్కడ ఎలా ఉంది?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని మంగళవారం కలెక్టర్‌ అనురాగ్‌ జయంతి సందర్శించారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరించి.. అక్కడ వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. పారిశుధ్య నిర్వహణ సరిగ్గా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం బాలసదనం నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, నాయబ్‌ తహసీల్దార్‌ దివ్య, ఆర్‌ఐ మధు, సర్వేయర్‌ మురళి, వృద్ధాశ్రమం సిబ్బంది మమత, శ్రీధర్‌ ఉన్నారు.

కాలుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు.. ఎండుతున్న పంటలు

- మరమ్మత్తులో జాప్యం
- పట్టించుకోని అధికారులు
- సెస్‌ పరిధిలో కాలిపోయిన 180 ట్రాన్స్‌ఫార్మర్లు
- రోజుకు 12 మాత్రమే అందుబాటులోకి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):ఏకధాటిగా కురిసిన వర్షాలకు విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. ఒక వైపు వర్షాలు కురిసి పంట పొలాలు నీటిలో మునిగిపోతుంటే.. మరో వైపు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి విద్యుత్‌ సరఫరా నిలిచి పంటలు ఎండిపోతున్నాయి. వరిపొలాల్లో నీరు లేక బీటలు వారుతున్నాయి. సిరిసిల్ల సెస్‌ పరిధిలో పది రోజుల వ్యవధిలో 180 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. విద్యుత్‌ సరఫరాలో హెచ్చుతగ్గులతోనే ఈ సమస్య తలెత్తుతుందని తెలిసింది.

రోజుకు 12 మాత్రమే అందుబాటులోకి..

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సెస్‌ సంస్థ ప్రతి రోజు మూడు ట్రాన్స్‌ఫార్మర్లను, ప్రైవేట్‌గా మరో మూడు ట్రాన్స్‌ఫార్మర్లను మాత్రమే మరమ్మతు చేయగలుగుతుంది. దీని ప్రకారం రిపేర్‌ ద్వారా 6 ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులోకి రానుండగా రోజుకు 6 కొనుగోలు చేయగలమని సెస్‌ అధికారులు తెలిపారు. దీని ద్వారా రోజుకు 12 ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులోకి వస్తే కాలిపోయిన 180 ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి బిగించాలంటే 15 రోజులు పట్టే అవకాశం ఉంది. అయితే పరిస్థితులు అన్ని అదుపులో ఉంటేనే.. కానీ ఒకదాన్ని మరమ్మతు చేసే లోపే మరొకటి కాలిపోతుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాగైతే ఇప్పటికే నాట్లు వేసిన పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉంది.



కాలిపోయిన విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద రైతులు



ఎండినపొలంలో పడుకొని రైతు నిరసన

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఓ రైతు ఎండిన పంట పొలంలో పడుకొని నిరసన తెలిపాడు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో 18 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి.

బ్రేక్‌డౌన్‌లతోనే సమస్య

విద్యుత్‌ సరఫరాలో బ్రేక్‌డౌన్‌లతోనే ఎక్కువ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. దీనికి తోడు ఉరుములు, మెరుపులతోనూ మరికొన్ని కాలిపోతున్నాయి. లూజ్‌వైర్లను సరిచేస్తూ ఎక్కువగా లోడ్‌ లేకుండా కనెక్షన్లను బట్టి ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ దిశగా సెస్‌ అధికారులు ముందుకు పోవాలని రైతులు కోరుతున్నారు.

పట్టించుకుంటలేరు



ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన విషయాన్ని అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదు. నీరందక నారు ఎండిపోతోంది. ఒకవైపు నారుమడులు ఎండిపోవడం, మరో వైపు వేసిన నాట్లు నీరందక వాలిపోతున్నాయి. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో మరమ్మతు చేయాలి. – బింగి ఎల్లయ్య, ఎల్లారెడ్డిపేట

ఫోన్‌ జేసినా స్పందన లేదు



ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేయండని అధికారులకు ఎన్నిసార్లు ఫోన్‌ చేసినా స్పందించడం లేదు. ఆఫీస్‌ వెళ్తే అందుబాటులో ఎవరూ ఉండడం లేదు. పంటలు సాగుచేసిన మొదట్లోనే ఎండిపోయి బీటలు వారుతున్నాయి.
– వద్నాల వెంకటేశ్‌, ఎల్లారెడ్డిపేట

మరమ్మతులు చేయిస్తున్నాం



ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండలంలో 18 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. సెస్‌ పరిధిలో రోజుకు 12 మాత్రమే అందుబాటులోకి వస్తున్నాయి. కొత్తవి మార్కెట్‌లో అందుబాటులో లేవు. సకాలంలోనే బిగిస్తాం.
– వరుస కృష్ణహరి, సెస్‌ డైరెక్టర్‌, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

సత్యనారాయణ నియామకంపై హర్షం



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎరుకల కులస్తులు

వేములవాడ: అట్టడుగు వర్గాలకు చెందిన కుర్ర సత్యనారాయణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం అభినందనీయమని వేములవాడకు చెందిన ఎరుకల కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తెలంగాణ చౌక్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం టపాసులు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం చేస్తుందన్నారు. తమ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను చట్టసభలో ఏకరువు పెట్టడానికి సీఎం అవకాశం కల్పించారన్నారు. సీఎంకు తమ కులస్తులంతా రుణపడి ఉంటారన్నారు.

ఎంపీ సోయం క్షమాపణ చెప్పాలి



సమావేశంలో గిరిజన నాయకులు

వీర్నపల్లి(సిరిసిల్ల): ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబురావు అనడం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని గిరిజన నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీ బాబురావుకు తగిన బుద్ధి చెప్పడానికి గిరిజనులు రెడీగా ఉన్నారన్నారు. సమావేశంలో శ్రీరామ్, మదన్, పీర్యా, తులసీరామ్, గజన్, రాములు, జవహర్, తిరుపతి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో కాషాయజెండా ఎగరేద్దాం



సమావేశంలో ప్రవీణ్‌రావు తదితరులు

వేములవాడ: దేశంలో బీజేపీ హవా కొనసాగుతుందని, వచ్చే ఎన్నికల్లో వేములవాడలో కాషాయజెండా ఎగురవేద్దామని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ ఇన్‌చార్జి బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు అన్నారు. పట్టణంలోని భీమేశ్వర గార్డెన్‌లో మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పార్టీ ఇచ్చే కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు విధిగా పాటించి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు క్యాతం దశరథరెడ్డి, రేగుల మల్లికార్జున్, మార్త సత్తయ్య, కొడిపల్లి గోపాల్‌రెడ్డి, గోపు బాలరాజు, నంద్యాడపు వెంకటేశ్, రేగుల సంతోష్‌బాబు, జక్కుల తిరుపతి, ముంజ శీను, వెంకటేశ్వర్‌రావు, బండ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వరదకాల్వ తెచ్చిన తంటా..

- అదనపు టీఎంసీ పనుల్లో మునుగుతున్న కరెంట్ పోల్స్
- సమీప పొలాలకు నిలిచిన విద్యుత్ సరఫరా
- పంటలకు నీరందక ఇబ్బందులు
- పునరుద్ధరణకు రూ.కోటితో అంచనాలు
- తాత్కాలిక సౌకర్యంతో లోఓల్టేజీ సమస్యలు

బోయినపల్లి(చొప్పదండి): అదనపు టీఎంసీ వరదకాల్వ నిర్మాణంతో రైతులకు అదనపు విద్యుత్ కష్టాలు తప్పడం లేదు. వరదకాల్వ తవ్వకాలతో పెద్ద ఎత్తున కరెంట్‌పోల్స్ పోతున్నాయి. దీంతో కాల్వపరిసరాల్లోని పొలాలకు కరెంట్ సరఫరా కావడం లేదు. కరీంనగర్ జిల్లా రామడుగు, గంగాధర మండలాల మీదుగా రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు 23 కిలోమీటర్ల మేర అదనపు టీఎంసీ వరదకాల్వ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కాల్వ నిర్మాణంలో రెండు జిల్లాల్లోని మూడు మండలాల్లో సుమారు 600 ఎకరాల మేర భూములు ముంపునకు గురవుతున్నాయి.

విద్యుత్ వ్యవస్థ చిన్నాభిన్నం

వరదకాల్వ నిర్మాణంలో అనేక చోట్ల విద్యుత్ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. రైతులు సాగుచేసే పొలాల మీదుగా భూములు సేకరించి వరద కాల్వ నిర్మిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలోని కరెంట్‌పోల్స్ కాల్వలో పోతున్నాయి. ఈక్రమంలో ఆ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం లేకుండా పోయింది. వరదకాల్వకు అవతలి వైపు బావులు, బోరుబావులతో సేద్యం చేసే రైతులు కరెంట్ సౌకర్యం లేక కష్టాలు పడుతున్నారు. ఇలాంటి రైతులు బోయినపల్లి మండలంలోని విలాసాగర్‌లో ఎక్కువగా ఉన్నారు. రైతుల కష్టాలు తెలుసుకున్న సెస్ ఎండీ తాత్కాలికంగా విద్యుత్ సౌకర్యం కల్పించే పనులు చేయిస్తున్నారు.



కాల్వ మధ్యలో విద్యుత్ పోల్



వరద కాల్వ తవ్వకాల మధ్యలో విద్యుత్ పోల్స్

రూ.కోటి అంచనాలతో విద్యుత్ పనులు

వరదకాల్వ నిర్మాణంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులకు రూ.కోటి అంచనాలతో పనులు చేపడుతున్నట్లు సెస్ అధికారులు తెలిపారు. కాల్వ నిర్మించే కాంట్రాక్టర్ సెస్‌కు రూ.కోటి వరకు చెల్లించినట్లు పేర్కొన్నారు. వరద కాల్వ నిర్మాణంలో కాల్వలో సుమారు 60 వరకు కరెంట్‌పోల్స్ ముంపునకు గురవుతున్నాయి. విలాసాగర్‌లో ఓ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. వరద కాల్వ పరిసరాల్లో ముంపునకు గురవుతున్న స్తంభాల స్థానంలో కొత్తగా వేయాల్సి ఉంది. గ్రామానికి వెళ్లే రెండు లైన్లు వేయాలి. మధ్యలో లింక్‌లైన్, నాలుగు విద్యుత్ టవర్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. సుమారు 150 వరకు కొత్త స్తంభాలు వేయాలి. కొత్త స్తంభాలకు దాదాపు 5 కిలోమీటర్ల మేర 11 కేవీ విద్యుత్‌లైన్ వేయాల్సి ఉంది. ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు, ఆరు డీపీలు వేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

పనుల నిర్వహణకు సమయం

విద్యుత్ పనులు పూర్తి చేయాలంటే రెండు నెలల సమయం పడుతుందని అంచనా. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు వేరే ప్రాంతంలో పని ఉండడంతో విలాసాగర్‌లో పనులు చేపట్టేందుకు మరికొన్ని రోజులు పట్టేలా ఉందని తెలిసింది. నెల క్రితం వరినార్లు పోసిన సమయంలో విద్యుత్ సౌకర్యం లేదని సిరిసిల్లలోని సెస్ ఎండీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. స్పందించిన సెస్ ఎండీ త్వరగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు సమాచారం. అయినా పనులు ఇప్పటికీ మొదలుకాలేదు.

పూర్తి సమాచారం ఇలా..

ముంపునకు గురవుతున్న పోల్స్	: 140
కొత్తగా వేసే పోల్స్	: 150
కొత్తగా వేసే ట్రాన్స్‌ఫార్మర్లు	: 06
కొత్తగా వేసే డీపీలు	: 06
11 కేవీ విద్యుత్ లైన్ వేసే ప్రాంతం	: 5 కిలోమీటర్లు

లో ఓల్టేజీతో ఇబ్బందులు



వరదకాల్వ నిర్మాణంలో పోల్స్ ముంపునకు గురవడంతో విద్యుత్ సౌకర్యం పోయింది. సెస్ అధికారులు తాత్కాలికంగా వేరే ట్రాన్స్‌ఫార్మర్‌కు లైన్ కలిపారు. అయితే 20 మోటార్ల లోడ్ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు 23 మోటార్లు కలిపారు. దీంతో లో ఓల్టేజీ సరఫరా జరుగుతోంది.

– గంగాధర రమేశ్, విలాసాగర్

విద్యుత్ సమస్యలు తీర్చాలి



విలాసాగర్ సబ్‌స్టేషన్ కింద పెద్ద మొత్తంలో రైతులు పంటలు సాగుచేస్తున్నారు. వరద కాల్వ తవ్వకాలతో విద్యుత్ పోల్స్ విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తాత్కాలిక విద్యుత్ సౌకర్యంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సెస్ అధికారులు రైతుల సమస్యలు పరిష్కరించాలి.

– ఏనుగుల కనకయ్య, విలాసాగర్

సమస్యలు పరిష్కరిస్తాం



బోయినపల్లి మండలంలో వరదకాల్వ నిర్మాణంలో కరెంట్‌పోల్స్ ముంపునకు గురవుతున్నాయి. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం. కొత్తగా కరెంట్‌పోల్స్ పనులు జరుగుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా విద్యుత్ పనులు పూర్తవుతాయి. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

– కొట్టెపెల్లి సుధాకర్, సెస్ డైరెక్టర్, బోయినపల్లి

‘ఆరోగ్య మహిళ’కు స్పందన

సిరిసిల్లటౌన్: ఆరోగ్యమహిళ కార్యక్రమాన్ని ప్రతీ వారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. సిరిసిల్లలోని బీవైనగర్, వేములవాడ పీపీసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యారోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ 322, బ్రెస్ట్ 316, ఓరల్ కావిటీ 316 పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ 7, ల్యాబ్ 57, థైరాయిడ్ 42, విటమిన్ డీ 26, సీబీపీ 37, సూక్ష్మ పోషకాలు 49 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో 9 మందిని జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం ఇంటి ముందు నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని దొంగలు చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన చిప్ప రాజేశం తన ఇంటి ముందు ఏపీ 13ఏసీ 8768 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచాడు. కాసేపటికి వచ్చి చూసేసరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

గొర్రెల మందపై కుక్కల దాడి

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని దాచారం గ్రామానికి చెందిన నరిగె మల్లేశంయాదవ్ గొర్రెల పాకలోకి మంగళవారం కుక్కలు చొరబడి 30 గొర్రెలపై దాడి చేయగా, 10 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మరో 20 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయని బాధితుడు తెలిపాడు. గాయపడ్డ గొర్రెల పరిస్థితి కూడా విషమంగా ఉందని, ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు.

కంప్యూటర్ చాంప్స్‌ను అమలు చేయాలి

చందుర్తి(వేములవాడ): విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుటకు కంప్యూటర్ చాంప్స్‌ను సరిగ్గా అమలు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. మండలంలోని మల్యాల జెడ్పీ స్కూల్, ప్రైమరీ స్కూల్, హరితహారం ప్లాంటేషన్ మొక్కలను పరిశీలించారు. గతేడాది నాటిన 1200 మొక్కలను కాపాడేందుకు కిలో మీటరుకు ఒకరిని చొప్పున ముగ్గురిని నియమించాలని సూచించారు. డీఈవో రమేశ్‌కుమార్, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, ఏపీడీ నర్సింహులు, తహసీల్దార్ మజీద్, ఎంపీడీవో రవీందర్, సర్పంచ్ లక్ష్మీనారాయణ, వైస్ఎంపీపీ అబ్రహం, ఎంపీవో ప్రదీప్‌కుమార్, ఉపాధిహామీ ఏపీవో రాజయ్య ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

కార్మికులు కాదు.. ప్రభుత్వ ఉద్యోగులు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్లటౌన్: ఇకపై ఆర్టీసీలో పనిచేస్తున్న సిబ్బంది కార్మికులుగా కాకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందడం శుభపరిణామమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం సిరిసిల్ల డిపోలో ఆర్టీసీ సిబ్బంది సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించగా..ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల చిరకాల వాంఛను సీఎం కేసీఆర్ పెద్దమనస్సుతో నెరవేర్చారన్నారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కార్మిక విభాగం అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్, సిబ్బంది లకావత్ రాంరెడ్డి, జీపీ సింగ్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో..

వేములవాడఅర్బన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకోవడంతో వేములవాడ ఆర్టీసీ కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జెడ్పీటీసీ మ్యాకల రవి, డిపో మేనేజర్ మురళీకృష్ణ, కౌన్సిలర్లు జోగిని శంకర్, నరాల శేఖర్, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, పోలాస నరేందర్, రామతీర్థపు రాజు, బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



సంబరాల్లో కార్మికులు, బీఆర్‌ఎస్ నేతలు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని సనుగుల గ్రామంలో దెబ్బతిన్న పంటలు, రోడ్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వడగళ్ల వాన, గతేడాది వర్షాకాలంలో ఇసుక మేటలు వేసి పంటలు దెబ్బతిన్న రైతులకు నయాపైసా పరిహారం చెల్లించలేదన్నారు. ప్రకటనలతో కాలయాపన చేస్తూ రైతు మోసం చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. తెగిపోయిన రోడ్ల మరమ్మతులు చేయడంలో జ్యాపం చేయడం తగదన్నారు. ప్రయాణికుల రాకపోకలను తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఏమీ పట్టనట్లు ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు ముస్కు ముకుందరెడ్డి, గొట్టె ప్రభాకర్, పులి సత్యం, ఎనుగుమెట్ల అమరేందర్‌రెడ్డి, ఏగోలం శ్రీనివాస్‌గౌడ్, బొజ్జ మల్లేశం, ఇందూరి మధు, ధర్మపురి శ్రీనివాస్, దూది శ్రీనివాస్‌రెడ్డి, ఆజ్మీరా గణేశ్, సుదర్శన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సాయిప్రణయ్



జాషువాను అభినందిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

కోనరావుపేట(వేములవాడ): మండల కేంద్రానికి చెందిన బొల్లె జాషువా, కనగర్తి ఉన్నత పాఠశాలకు చెందిన పులి సాయిప్రణయ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం జిల్లాస్థాయిలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా, జాషువా 400, 100 మీటర్ల పరుగులో విజయం సాధించాడు. సాయిప్రణయ్ అండర్–16 విభాగంలో 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ నెల 7న హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జాషువా, సాయిప్రణయ్ పాల్గొంటారని అథ్లెటిక్ జిల్లా ప్రెసిడెంట్ చిక్కాల రామారావు తెలిపారు. క్రీడాకారులను డీఎస్పీ నాగేంద్రచారి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఆజాద్, సర్పంచులు పోకల రేఖ, అనుపాటి భారతి, హెచ్ఎం మాణిక్యం, పీఈటీ అజయ్‌కుమార్ అభినందించారు.

నిధుల మంజూరుకు ప్రాధాన్యతనివ్వండి

- బి.వినోద్‌కుమార్‌తో ఎమ్మెల్యే రమేశ్‌బాబు



వినోద్‌కుమార్‌తో సమావేశమైన ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: నిధుల మంజూరుకు ఈఎన్‌సీతో మాట్లాడి తమకు ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను మంగళవారం కలిసి కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనల మరమ్మతులకు నిధులు ఇప్పించాలని విన్నవించారు. బీసీబంధు, గృహలక్ష్మి, దళితబంధు పథకాల మంజూరుపై చర్చించినట్లు చెప్పారు.

కారుబోల్తా.. ఒకరికి గాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారు సిరిసిల్ల– కరీంనగర్ రహదారిలో మంగళవారం కారు బోల్తాపడింది. పోలీసుల వివరాలు.. కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన గెంట్యాల సాయిలు కరీంనగర్ నుంచి కామారెడ్డికి కారులో వెళ్తున్నాడు. నాంపల్లి శివారులో ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి కారు బోల్తాపడగా, సాయిలుకు గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అధిక వడ్డీ కోసం పీడిస్తే చర్యలు

- సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి నిరుపేదలను పీడిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్ హెచ్చరించారు. సిరిసిల్లరూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లాలో అధిక వడ్డీ పేరుతో గ్రామాల్లో పేదల వద్ద ఉన్న విలువైన పత్రాలు, ఆస్తులను తాకట్టు పెట్టుకుని పీడిస్తున్నారని ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని తెలిపారు. అక్రమ వడ్డీలకు అప్పులు ఇచ్చే నిందితులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమవారం విశ్వసనీయ సమాచారంతో అంజయ్య అనే వ్యక్తి ఇంట్లో సోదాలు చేయగా రూ.60 లక్షల అప్పు తీసుకున్న పత్రాలు దొరికాయని వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. 30 మంది పేదలు అధిక వడ్డీ బాధితులుగా రుజువు అయ్యిందని పేర్కొన్నారు. 9 ప్రామిసరీ నోట్లు, 10 బాండ్‌పేపర్స్, 12 సాదాబైనామాలు, ఒక టీవీఎస్ మోపెడ్, ఒక ట్రాక్టర్ సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

ఠాణా సందర్శన

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్ మంగళవారం రాత్రి సందర్శించారు. నూతనంగా సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ సదన్‌కుమార్ తొలిసారిగా ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. కేసుల నమోదు, రికార్డులను పరిశీలించారు. ఇటీవల జరిగిన చోరీలు రికవరీలను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని అందించాలన్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జర్నలిస్టులకు ఆరోగ్య పథకం అమలు చేయాలి

రుద్రంగి(వేములవాడ): జర్నలిస్టులకు ఆరోగ్య పథకం అమలు చేయాలని, అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ మండల అధ్యక్షుడు దేశవేని ధర్మేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలో పోస్టు కార్డు ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సాధనలో జర్నలిస్టులు ముఖ్య భూమిక పోషించారని, అలాంటి జర్నలిస్టులు నేడు స్వరాష్ట్రంలో ఆరోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వ్యవహరించే జర్నలిస్టుల ఆరోగ్య విషయంలో సత్వరమే ప్రభుత్వం స్పందించి హెల్త్ స్కీం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎలిగేటి సూర్యకిరణ్, నాయకులు నంద్యాడపు అంజయ్య, బింగిశెట్టి వెంకటేశ్, కూర్మాచలం సత్యనారాయణ, ఎలిగేటి ప్రదీప్, కంటె స్వామి, పోగుల మోహన్, పడాల రమణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టు కార్డు ఉద్యమంలో జర్నలిస్టులు

గంభీరావుపేటలో..

గంభీరావుపేట(సిరిసిల్ల): జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు ఎర్ర శ్రీనివాస్ నేతృత్వంలో సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నాయకులు పాపగారి యాదగిరిగౌడ్, గాండ్ల రవీందర్, మండల నాయకులు సయ్యద్ అసిఫ్‌అలీ, పెద్ది రాజు, అరిగె రమేష్, అర్జున్‌రెడ్డి, బ్రహ్మాచారి, సంతోష్‌చారి పాల్గొన్నారు.

వస్త్రవ్యాపారంలో నష్టాలు

- మనస్తాపంతో వ్యాపారి ఆత్మహత్య



నరహరి (ఫైల్)



నరహరి రాసిన సూసైడ్ నోట్

జగిత్యాలక్రైం: వస్త్రవ్యాపారంలో నష్టాలు రావడం, పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మనస్తాపం చెందిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన హోల్‌సేల్ వ్యాపారి గాజుల నరహరి(55) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నరహరి పట్టణంలో హోల్‌సేల్ వ్యాపారి. దందా బాగా సాగేందుకు బ్యాంక్‌లో కొంత రుణం తీసుకున్నాడు. తెలిసినవాళ్ల వద్ద మరికొంత అప్పు చేశాడు. అయితే, వ్యాపారంలో ఆశించిన లాభాలు రాకపోవడం, తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం, వాటిని తీర్చేదారిలేకపోవడంతో ఆయన తీవ్రమనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఉదయం పట్టణంలోని జగిత్యాల క్లబ్‌కు వెళ్లాడు. ఇంటినుంచి తెచ్చుకున్న తాడును సీలింగ్ ఫ్యాన్‌కు కట్టి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులకు వడ్డీ కట్టలేక, ఆర్థిక ఇబ్బందులు వెంటాడడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని, తనను క్షమించండని రాసిన లేఖ మృతుడి జేబులో లభించింది. కాగా, క్లబ్ స్వీపర్ గదులు శుభ్రం చేస్తుండగా నరహరి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో ఆయన కుటుంబసభ్యులతోపాటు, క్లబ్ సెక్రెటరీ నారాయణరెడ్డికి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ నటేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సచిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య ఉంది. కూతురు అమెరికాలో ఉంటోంది. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు జాప్యమయ్యే అవకాశం ఉంది.

సిరిసిల్లలో బాలుడిపై వీధికుక్క దాడి

సిరిసిల్లటౌన్: వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఓ బాలుడిపై ఐదు నెలల్లో రెండోసారి దాడి చేశాయి. జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌కు చెందిన ఎండీ ఆసిన్(5) మంగళవారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికొచ్చి స్కూల్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో అటువైపు వచ్చిన కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. కుక్కల దాడితో బాలుడి ముఖం, చేతులపై గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరిమేయడంతో ప్రాణాపాయం తప్పింది. తీవ్రంగా గాయపడ్డ ఆసిన్‌కు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. గత మార్చి 17న ఇదే బాలుడు ఇంటిముందు ఆడుకుంటుండగా కుక్కల మంద దాడి చేసింది. ఆ సంఘటన నుంచి బాలుడు తేరుకుంటున్న సమయంలో మళ్లీ దాడిచేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కలను నివారించాలని కోరుతున్నారు.



గాయపడిన ఆసిన్

రైతులకు శాపంగా మారిన పాలకుల నిర్లక్ష్యం

కోనరావుపేట(వేములవాడ): పాలకులు అనాలోచితంగా చేస్తున్న పనులు రైతుల పాలిట శాపంగా మారాయని కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెటి అవినాశ్‌రెడ్డి అన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డితో కలిసి మామిడిపల్లి, బావుసాయిపేట గ్రామాల్లో వర్షాలకు ఇసుక మేటలు వేసిన పొలాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మామిడిపల్లి మూలవాగులో అవగాహన లేకుండా నిర్మించిన చెక్‌డ్యామ్ కారణంగా అరకిలోమీటర్ వరకు ఇసుక మేటలు వేయడం జరిగిందన్నారు. బావుసాయిపేట శివారు మూలవాగులో ఇసుక రీచ్ ఏర్పాటు చేయడంవల్ల నష్టం మరింత ఎక్కువ అయిందన్నారు. అధికారులు గ్రామాల్లో సర్వే చేయించి బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, బైరగోని నందు, నంద్యాడపు సాగర్, జూకంటి మల్లేశం, ప్రేమ్‌చంద్, జవ్వాజి రాములు, పోకల అశోక్ , శ్రీనివాస్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తున్న నాయకులు